# శ్రీమతి

## సంపత్‌రాజ్

''కాఫీ కాఫీ కాఫీ కాఫీ'' కాకుల్లా అలా అరుస్తూనే ఉంటారక్కడ. ఒకరు కాఫీ, మరొకరు ఇడ్లీ, వడా, ఇంకొకరు పేపర్ వీక్లీ అంటూ.

సర్వకాల సర్వావస్థలలోనూ 'విజయవాడ జంక్షన్' ప్లాట్‌ఫాం పరిస్థితి ఇది.

''యువర్ అటెన్షన్ ప్లీజ్..

దయచేసి వినండి...

''కృపయా ధ్యాన్ దీజియే..'' అంటూ ఎనౌన్సర్ మూడుభాషల పాండిత్యాన్ని ముచ్చటగా వినిపించాక, ఝూమ్మని కదిలింది రైలు. విజయవాడ నుండి, ఐదుగంటల్లో సికింద్రాబాదు కొచ్చే ఈ రైలంటే యమిష్టం నాకు. ఏమాత్రం ఛాన్సు దొరికినా శనివారం సాయంత్రం అత్తారింటికీ సోమారం ప్రొద్దున్నే మాయింటికీ...

మెల్లగా సిగరెట్ పారేసి వెళ్ళి శ్రీమతి ప్రక్కన కూర్చొన్నాను. నాకు బాగా ఇష్టమైనవి నా శ్రీమతీ, మరోటి నా సిగరెట్టు. అప్పుడప్పుడూ ఇలా తెల్లవారు జాము ప్రయాణాలూ...ఇలా మసక మసక వెల్తుర్లో రైలుప్రయాణం భలే ఉంటుంది.

''ష్...చలేస్తుంది కదా?'' శ్రీమతి భుజం చుట్టూ చేయి వేసాను.

''నాకు లేదండీ'' భుజం మీద పాము పడినంత కంగారుగా చేయి తీసేస్తూ అంది.

''కొడైకెనాల్లో ఇద్దరం ఒకే దుప్పటి కప్పుకొని తిరిగినప్పుడు లేంది. ఇప్పుడెందుకింత కంగారూ?'' దగ్గరగా జరుగుతూ చెవిలో అన్నాను.

''నాకప్పుడు చలేసింది'' కళ్ళు రెపరెప లాడిస్తూ అమాయకంగా అంది.

వాన చినుకులంత స్వచ్ఛమైన కళ్ళూ, ఆ బుంగమూతీ, ఆ చూపులూ ఇవే నన్ను పెళ్ళి చూపుల్లో పడేసింది, పెళ్ళై ఏన ఈ ఏణ్ణార్థంగా కట్టి పడేసింది.

''మా అమ్మాయికి కాస్త మోడెస్టీ లెండి'' పెళ్ళి చూపులనాడు మా అత్తగారి మాటలకు-

''ఈ మోడెర్నిటీ రోజుల్లో మాడెస్టీ ఏంటండీ'' స్టైల్‌గా అన్నాను.

''మోడెస్టీలో మోడర్నిటీ'' ఎవరో అందించారు.

''ఈకాలంలో అమ్మాయిలే అబ్బాయిల కన్నా స్పీడు, మా అమ్మాయి నెమ్మదవటం మీ అదృష్టం.''

''కాని నేను సూపర్ ఫాస్ట్ కదా'' గర్వంగా నవ్వాను.

★★★

అనుకోకుండా ఫ్లాష్‌బ్యాక్ నవ్వు పెదవుల మీద కొచ్చింది.

''ఏంటండీ'' అడుగుతున్న శ్రీమతిని దాటి సిగరెట్ వెలిగించాను. ఇంతలో ఖమ్మం వచ్చింది. గబగబా రైలు దిగి ఓ వారపత్రిక కొన్నాను.

పైపైకి వస్తున్న సూర్యుడితో పోటీ పడుతున్నట్లు పరిగెడుతున్న రైలు గేట్లో నుంచొని, చెట్లో చేమల్లో జరిగిపోతున్న దోమ తెరలాగున్న మంచును చూస్తూ ఇలా సిగరెట్ త్రాగటంలో ఎంతటి 'మగానందం.'

''ఎక్కడికి కెళ్ళారండీ'' పత్రిక చేతికిస్తుంటే అడిగింది శ్రీమతి. కళ్ళెగరేసి పుస్తకం చేతి కిచ్చాను.

''ఈ రైలు చాలా స్పీడండీ'' పుస్తకంలోకి చూస్తూనే అంది.

''మనం అంతకన్నా స్పీడండీ'' బింకంగా అన్నాను.

''మీరొచ్చేదాకా నాకు కంగారండీ.''

''ఎందుకండీ'' సాగదీసాను. ''నేనిప్పటికి రెండొందల రైలు ప్రయాణాలు చేసుంటాను. అంటే వేయిసార్లు ఇలా ఎక్కి దిగి ఉంటాను. అయినా నా కలవాటే కాదా?'' ఆమె గడ్డం పట్టి పైకి లేపుతూ అన్నాను.

అందమైన ఆ కళ్ళలో ఏదో తడి.

నిజంగా నాశ్రీమతంటే నాకెంతో ఇష్టం. ఎంతో అమాయకంగానూ అప్పుడప్పుడు కొంత తెలివిగానూ...ఎక్కువ మాట్లాడకుండానే ఎక్కువ అర్థమైపోతుంది. కానీ, చిన్న విషయానికే ఇలా...

ఈకాలం కుర్రాళ్ళ కన్నా ఆడపిల్లలే ఎక్కువ తెలివిగానూ స్పీడుగానూ ఉంటున్నారని ఎవడన్నాడో కాని, వాడికి నా శ్రీమతిని చూపించి ఆమె చెప్పుతోనే కొట్టాలి.

రైలాగిన ప్రతిసారీ నేను దిగుతానని తెలుసు, అయినా ప్రతిసారీ అదే కంగారూ, అదే భయం.

''మీరు బండెక్కలేకపోతే మరో బండిలో వస్తారు, నేనొక్కదాన్నీ వెళ్ళాలంటే నాకెంత ఇబ్బందీ...ఎందుకొచ్చిన టెన్షనండీ''

అసలు టెన్షన్ ముందు పుట్టి ఆడవాళ్ళు వెంటనే పుట్టేరనుకొంటా...

''ఈ మాత్రానికే అంత దిగులా బాలా, బేలా, అలా చూడకే''

ప్రక్కనున్న మధ్య వయస్సు జంట మా వంకే చూస్తున్నారు.

ఆడవాళ్ళు అమాయకంగా ఉండటం మగవారి అదృష్టాన్ని బట్టి ఉంటుందనుకొంటా, అవకాశవాదులు కాకుంటే అద్భుతమైన దాంపత్య జీవితాన్ని అనుభవించవచ్చు. నిజమైన ఆడతనం, నాకు నచ్చే బేలతనం నా శ్రీమతిలోనే ఉన్నాయి. అసలీమె నిజంగానే ఇంత మొద్దా లేక ఈమె ఇలా ఉంటేనే నాకు ముద్దని కనిపెట్టేసి ఇలా తయారయిందా?

అందమైన మా దాంపత్యానికి ఆడియన్సు కూడా ఉన్నా నాకు సరదాగానే ఉంటుంది. అందుకే ఇలా ఏడిపిస్తుంటాను.

ఆ అమాయకపు మాటలూ, అయోమయపు చూపులూ, బుంగమూతీ, బేలముఖం, ముద్దైన పెదవులూ....ఇవన్నీ నా బ్రతుకు పుస్తకంలో ముద్దు ముద్దుల ముద్దరవేసిన పుటలు....

కలకంఠి కంటి చూపు మహా సామ్రాజ్యాలనే కూలుస్తుందా? సామ్రాట్టులనూ సామాన్యులగా మారుస్తుందా?

★★★

''ఏవండీ''

మధుర స్మృతుల నుండి నిద్రలోకి జారుకొన్న నాకు శ్రీమతి పిలుపుతో మెళకువ వచ్చింది.

''అరే ఖాజీపేట వచ్చేసాం''

సిగరెట్ కోసం జేబులో చేయి పెట్టుకోబోతుండగా ''ఏమండీ. ప్లాట్ ఫాం మీద ఖర్జూరపండు బాగుందండీ, కొనుక్కొనొచ్చేస్తా.''

''నే తెస్తానూ'' అనే లోగానే చటుక్కున కదలి ఛంగున ఓ దూకు దూకి జనంలో కల్సిపోయింది.

అబ్బ ఇంతమంది ప్రజల్ని మోస్తున్న రైల్లెంత గొప్పవి, డైలీ సర్వీసులూ, వీక్లీ సర్వీసులూ కల్సి కిటకిట లాడుతుంది రైలు.

ఎక్కేవాళ్ళకు తొందరా, దిగేవాళ్ళకు గాభరా....ఇంత స్పీడు లోకంలో ఎంత స్పీడుగా ఉండాలి.

రైల్లో ఖాళీ లేదు గదాని బాత్రూంలో సిగరెట్ కాల్చి వచ్చే సరికి రైలుకదలి నడుస్తుంది.

అవునూ శ్రీమతేదీ ''శ్రీ''

నా పిలుపునాకే వినబడలేదు. హైదరాబాదు మల్కాజిగిరి బస్సులో ఉన్నట్లు గేట్ల నిండా ఉన్నారు ప్రజలు.

''శ్రీ''

ఇంకా గట్టిగా అరుస్తూ పరీక్షగా చూసాను, ఏదీ కన్పించదే...అయ్యో బండి స్పీడందుకొంటుంది. శ్రీమతేదీ, సికింద్రాబాద్ దాకా ఇంకెక్కడా ఆగదీ బండి.



''శ్రీ''...నాగుండె కొట్టుకోవటం మానేసింది. ఒక్క ఉదుటన్న వెనక్కి తిరిగి చైనందుకోబోయాను.

అయ్యో ఈ తోపిడిలో, ఈ త్రొక్కిసలో చైనెక్కడందుతుందీ...కాలు పట్టు తప్పి ప్రక్కనున్న వారిపై పడ్డాను.

''ప్లీజ్..ఎవరైనా చైన్ లాగండీ..నా..భార్య రైలెక్కలేదూ''

మాటలూ...ఆయాసం...ఏడుపుగొంతూ కలసి నేనేం చెప్పానో నాకే అర్థం కాలేదు.

ఎలా....ఎలా రైలు ఊపందుకొందే ఎలా....

''చైన్ లాగండీ...చైన్ లాగండీ...చైన్ లాగండీ'' పిచ్చివాడిలా అరవటం మొదలెట్టాను.

ఇంతలోనే నా చెవి వెనుగ్గా..గుసగుసా...

''ఏయ్''

ఎంతో చనువు తీసుకొన్నప్పుడు శ్రీమతి పిలిచే పిలుపూ దాంతోపాటే ''ఫయర్ యువర్ నోస్ ఓన్లీ'' అన్నట్లుంటే ఆ ప్రత్యేకమైన పరిమళం.

గిరుక్కున వెనక్కి తిరిగాను.

''కంగారు పడ్డారండీ'' ఎంతో అమాయకంగా ప్రశ్నిస్తూంది.

రెండు ఛర్రీ పళ్ళ మధ్యన ఓ ఖజ్జూరపండూ....

ఉద్వేగంతో నా వళ్ళు వణకిపోతుంది.

ఓ నిశ్వాస, నిశ్చింతగా బయటకొస్తుంటే, ఓ నిట్టూర్పు నీటి చుక్కై చెంప జారింది.

నడి వయస్సు జంట కుతూహలంగా చూస్తూ ముసిముసిగా నవ్వుతున్నారు.

అవునూ నేనెందుకింత కంగారుపడ్డానూ.

ఎవ్వరో కిసుక్కున నవ్వినట్లుంది....ఇంకెవరో పగలబడి నవ్వుతున్నారు.

మరెవ్వరో కిలకిలామన్నారు..నా శ్రీమతి నవ్వులా...ఈవిడేమో చూస్తే అదే బుంగమూతీ ఖజ్జూరపండులా....

విరచిన నొసలు మాత్రం 'ఈ మాత్రానికే ఇంత కంగారా బాలకా....బేలకా' అంటున్నట్లు....

ఆ..అమాయకమైన కళ్ళే....ఆ అయోమయపు చూపులే 'టెన్షన్‌కు ఆడా మగా తేడా ఉండదండీ' అంటున్నట్లూ....

సూటైన ఆ ముక్కేమో 'టిట్ ఫర్ టాట్' అన్నట్లూ...

బిగించిన పెదవులేమో 'ఎలా ఉందోయ్ మన దెబ్బ' అన్నట్లూ..

వ్వాహ్ క్యా శ్రీమతీ హై?

'ఎ బ్లెండ్ ఆఫ్ మాడెర్నిటీ ఇన్ మాడెస్టీ'

శ్రీమతీ నా శ్రీమతే.

★